క్లుప్తంగా

యూటీఎఫ్ కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవం



నూతనంగా ఎన్నికైన యూటీఎఫ్ కార్యవర్గం

హిరమండలం: యూటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికై ంది. మండల కేంద్రంలో యూటీఎఫ్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులుగా దండు ప్రకాష్, కె.చందరరావు వ్యవహరించారు. గౌరవ అధ్యక్షుడిగా బి.నాగరాజు, అధ్యక్ష, కార్యదర్శులుగా ఆకుల నారాయణ రావు, జి.రామకృష్ణ, సహాధ్యక్షులుగా నూలు దేవిక, రాడ చిన్నబాబు, కోశాధికారిగా బి.రాధాకృష్ణ, పలువురు కార్యదర్శులు, సంఘ సభ్యులు, కన్వీనర్లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్లు కోటేశ్వరరావు, రాజారావు, శంకరరావు, ఎల్.వి.రమణ, చందరరావు, సంఘ సభ్యులు క్రాంతిరాజు, సంధ్య, అప్పలరెడ్డి, రత్నకుమార్, సుభాష్‌చంద్ర పాత్రో, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

- షటిల్ టోర్నీ విజేత పెద్దసీది



మాట్లాడుతున్న గ్రంథాలయ నిర్వాహకుడు అనిల్ కుమార్

పాతపట్నం: యువత, విద్యార్థులు క్రీడల్లో రాణించాలని సారవకోట ఎంఈఓ ఎం.వి.రమణ అన్నారు. గురువారం మండలంలోని కొరసవాడ గ్రామంలోని బుగత సూర్యనారాయణ స్మారక గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం సందర్భంగా షటిల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పెద్దసీది గ్రామస్తులు ప్రథమ స్థానం సాధించారు. టోర్నమెంట్‌లో 16 టీమ్‌లు పాల్గొన్నాయి. కొరసవాడ గ్రామం ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకుడు బుగత అనిల్ కుమార్, కర్రి లక్ష్మీ నారాయణ, రమణ, హెచ్‌ఎం ఎస్.కుమారస్వామి, ఆర్.మధుసూదనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆలయ నిర్మాణానికి సహకరించాలని వినతి



పీరుకట్లకు వినతిపత్రం అందజేస్తున్న విశ్వబ్రాహ్మణులు

బూర్జ: మండలంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించడంతోపాటు ఆర్థికంగా సహకరించాలని మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాదరావుకు మండల విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు కోరారు. టీఆర్‌రాజేపేట గ్రామంలోని మాజీ ఎమ్మెల్సీ స్వగృహం వద్ద గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీరుకట్ల మాట్లాడుతూ.. అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందజేస్తామని సంఘం సభ్యులకు హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో మండల వీరబ్రహ్మం సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఢిల్లేశ్వరరావు

పొందూరు: మండలంలోని తాడివలస ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి తమ్మినైన ఢిల్లేశ్వరరావు అండర్–17 రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడని హెచ్‌ఎం బల్ల కంటయ్య, పీడీ ధవళ పెంటయ్య గురువారం తెలిపారు. ఈ నెల 23వ తేదీ నుంచి అనంతపురంలోని కొనగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో జరగనున్న పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటాడని పేర్కొన్నారు.

అపార్ అవస్థలు



ఎంఈఓ కార్యాలయం వద్ద విద్యార్థులు


సారవకోట: మండలంలోని శివారు పంచాయతీ రామకృష్ణాపురం నుంచి గురువారం పలువురు ఇంటర్మీడియెట్ విద్యార్థులు ఎంఈఓ కార్యాలయానికి వచ్చారు. 10వ తరగతి మార్కుల జాబితాలో ఉన్నట్లుగా ఆధార్‌లో పుట్టిన తేదీ లేవు. పుట్టిన తేదీకి సంబంధించిన ధ్రువపత్రాలు కావాలంటే రెవెన్యూ కార్యదర్శులు కొర్రీలు పెడుతున్నారని ఎంఈఓ ఎం.వి.రమణ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే సారవకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులకు చెందిన జనన ధ్రువీకరణ పత్రాలు ఆర్డీఓ నుంచి పొందేందుకు స్థానికంగా ఉన్న వీఆర్వో ఇబ్బంది పెడుతున్నారని ఉపాధ్యాయులు ఎంఈఓ దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా సమస్యలు పరిష్కరించాలని రెవెన్యూ సిబ్బందికి కలెక్టర్ ఆదేశించినా పలువురు కొర్రీలు పెడుతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనుసంధానం తప్పనిసరి

- బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ లింకు తప్పనిసరి చేసిన కేంద్రం
- ఈ నెల 30 లోపు అనుసంధానం చేసి బ్యాంకు ఖాతాలను పునరుద్ధరించాలని ఆదేశం
- నియోజకవర్గంలో ఎన్‌పీసీఐ లింకు కాని ఖాతాలు 27,421
- ప్రారంభమైన ప్రక్రియ
- రోజువారి లక్ష్యాలు చేరుకోవాలని కలెక్టర్ ఆదేశం

ఎన్‌పీసీఐ లింకు లేని ఖాతాల వివరాలు..

మండలం	లింకు లేనివి	లింకు అయినవి	చేయాల్సినవి
నరసన్నపేట	9,183	3,002	6,181
జలుమూరు	6,428	3,598	2,830
పోలాకి	6,664	4,097	2,567
సారవకోట	5,146	3,728	1,418



కంబకాయ పోస్టాఫీసులో బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ లింకు చేస్తున్న సిబ్బంది

నరసన్నపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందించే రాయితీలకు ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఇండియా) లింకు తప్పనిసరి చేశాయి. ఎన్‌పీసీఐ లింకు లేకపోవడంతో ప్రభుత్వ రాయితీలు లబ్ధిదారులకు అందకుండా పోయాయి. దీనిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం.. గ్రామ పంచాయతీల పరిధిలో జాబితాలను ఆయా మండలాలకు, గ్రామాలకు పంపింది. ఎన్‌పీసీఐ నిబంధనల ప్రకారం వినియోగంలో లేని ఖాతాలను తెరిపించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఈ నెల 30వ తేదీ లోగా పునరుద్ధరణ పూర్తిచేయాలని మండల స్థాయి అధికారులకు సూచించింది. దీనిపై రోజు వారీ లక్ష్యాలను ఎంపీడీఓలకు జిల్లా కలెక్టర్ ఇచ్చి, దీనిపై సమీక్ష చేస్తున్నారు.

ఖాతాల డిజిటలైజేషన్..

నరసన్నపేట నియోజకవర్గంలో 140 గ్రామ పంచాయతీల్లో నివాసముంటున్న మెజార్టీ వ్యక్తులకు బ్యాంకు ఖాతాలు ఉన్నప్పటికీ.. వాటిలో 27,401 ఖాతాలకు ఎన్‌పీసీఐ లింకు లేనట్లు ప్రభుత్వం గుర్తించింది. ప్రతీ గ్రామ, వార్డు సచివాలయం పరిధిలో లబ్ధిదారుల ఖాతాలను డిజిటలైజేషన్ చేయాలని ఇటీవల కేంద్రం నుంచి జిల్లాలకు ఆదేశాల వచ్చాయి. దీని ప్రకారం లబ్ధిదారులతోపాటు 18 ఏళ్లు నిండిన వారంతా పోస్టాఫీసుల్లో కొత్త ఖాతా తెరవాలని అధికారులు చెబుతున్నారు. దీనిపై ఆయా సచివాలయాల పరిధిలో సిబ్బంది చర్యలు చేపడుతున్నారు. బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఆయా ఖాతాలకు ఎన్‌పీసీఐ నిబంధనల ప్రకారం.. సంబంధిత బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం చేయాలని నాలుగు మండలాల ఎంపీడీఓలు సూచిస్తున్నారు. నరసన్నపేట, జలుమూరు, సారవకోట, పోలాకి మండలాల్లో అనుసంధానం ఖాతాల సంఖ్య తక్కువగా ఉంది. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు.

ఖాతాలు వినియోగం ఉండాలి



ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు నేరుగా అందాలంటే బ్యాంకు ఖాతాలు వినియోగంలో ఉండాలి. కొందరికి రెండు, మూడు ఖాతాలు ఉంటూ వాటిలో కొన్ని వినియోగంలో లేకపోవడంతో సమస్యలు వస్తున్నాయి. దీంతో వినియోగంలో లేని ఖాతాలను పునరుద్ధరించుకునేలా కేంద్రం చర్యలు చేపట్టింది. ఖాతాలకు ఎన్‌పీసీఐ లింకు లేనట్లు గుర్తించింది. వారందరికీ సచివాలయ సిబ్బంది ద్వారా సమాచారం అందించి లింకు చేసుకోవాలని కోరుతున్నాం. గ్రామాల్లో బ్రాంచ్ పోస్టాఫీసుల్లో ఈ ప్రక్రియ సాగుతోంది. లింకు లేనివారు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పూర్తిచేసుకోవాలి.

– బి.మధుసూదనరావు, ఎంపీడీఓ, నరసన్నపేట

ఎమ్మెల్యే గారూ.. అబద్ధాలు ఆపండి

- ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయండి
- డీసీసీబీ మాజీ ఛైర్మన్ కరిమి రాజేశ్వరరావు



మాట్లాడుతున్న డీసీసీబీ మాజీ ఛైర్మన్ కరిమి రాజేశ్వరరావు, నాయకులు

పోలాకి: ఎమ్మెల్యేగారూ మీరు అబద్ధాలు ఆపండి.. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయండి అంటూ నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని ఉద్దేశించి డీసీసీబీ మాజీ ఛైర్మన్ కరిమి రాజేశ్వరరావు అన్నారు. గురువారం పోలాకిలోని ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల అసెంబ్లీ సాక్షిగా నరసన్నపేటలో గత ఐదేళ్లుగా మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ హయాంలో జరిగిన అభివృద్ధిని దాచేసే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఒక్క నరసన్నపేటలోనే కాకుండా జిల్లాలో అనేక శాశ్వత, చరిత్రాత్మక ప్రాజెక్టులు చేపట్టామని గుర్తుచేశారు. జిల్లాలోనే అత్యధిక ఓపీ కలిగిన నరసన్నపేట వందల పడకల ఆస్పత్రి కృష్ణదాస్ హయాంలో అభివృద్ధి జరిగిందని, రికార్డులు పరిశీలించుకోవాలని ఎమ్మెల్యేకు సూచించారు. మండల పరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రమణమూర్తి, అతని కుటుంబ సభ్యులు ఇసుక, మద్యం, మట్టి, మొదలగు దోపిడీలు చేస్తున్నారని, వీటినుంచి ప్రజల దృష్టిని మరల్చటానికే ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో మత్స్యకారులు, రైతులు, దళితులు, వ్యాపారులతో పాటు అన్నివర్గాలకు ఇచ్చిన హామీలు అమలు ఎమ్మెల్యే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, యువజన విభాగం అధ్యక్షుడు రెంటికోట త్రినాథరావు, పార్టీ నాయకులు లండ యర్రయ్య, తూలుగు అశోక్‌కుమార్, కల్లేపల్లి లక్ష్మణరావు, రావాడ అప్పన్నరాజు, నేతేటి వల్లన్నాయుడు, పి.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆదివాసీ నాయకులు

పాతపట్నం: రాజ్యాంగ సమీక్షల పేరుతో అంబేడ్కర్ భావాలకు తూట్లు పొడుస్తున్నవారి ఆగడాలను అరికట్టాలని రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక సభ్యులు సి.హెచ్.శాంతారావు, సవర కుమార్, కృష్ణారావు అన్నారు. గురువారం స్థానిక కోర్టు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంలో ఆదివాసీల హక్కులను తుంగలోకి తొక్కి, ఆదివాసీ ప్రాంతాల్లో ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్పగిస్తున్నాయన్నారు. ఈ నెల 26వ తేదీన రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సంపత్ కుమార్, మిన్నారావు, తులసీరావు, రాము, తదితరులు పాల్గొన్నారు.


ఈ నీరు సురక్షితమేనా?



ఈ చిత్రంలో కనిపిస్తున్న గ్రామీణ రక్షిత మంచినీటి పథకం సరుబుజ్జిలి మండలంలోని చిన కాగితాపల్లి పంచాయతీ పరిధి బుడ్డివలస గ్రామంలోనిది. దీనిని నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం శుభ్రం చేయకపోవడం వలన నీటి నాణ్యతపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇటువైపు దృష్టి సారించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి ట్యాంక్‌ను శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

నిరుపయోగం..



సారవకోట మండల కేంద్రంలోని పోలీస్ క్వార్టర్స్ నిరుపయోగంగా ఉన్నాయి. కొన్ని దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనాలు వినియోగించేందుకు అవకాశం లేకపోవడంతో స్థానిక పోలీసులు అద్దె ఇళ్లల్లో ఉంటున్నారు. ఈ భవనాల చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగాపోయాయి. ఈ స్థలంలో నూతన భవనాలు నిర్మించాలని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది.

– సారవకోట

భక్తిశ్రద్ధలతో సాయి వ్రతాలు



నరసన్నపేటలోని చిత్తిరివీధిలో గల సత్యసాయి మందిరంలో సత్యసాయి బాబా జన్మదిన వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దీంట్లో భాగంగా గురువారం సాయి వ్రతాలు నిర్వహించారు. స్థానిక మహిళలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు వ్రతాలు నిర్వహించారు. ఏటా బాబా జన్మదినం సందర్భంగా వ్రతాలు నిర్వహిస్తున్నట్లు మందిరం కన్వీనర్ నాగేశ్వరరావు తెలిపారు.

– నరసన్నపేట

దుప్పట్ల పంపిణీ



భగవాన్ సత్యసాయి బాబా జన్మదిన వేడుకల్లో భాగంగా గురువారం హిరమండలంలో ఆనంద సేవను భక్తులు నిర్వహించారు. నిరుపేదలకు, రహదారులపై నివసిస్తున్న అనాథులకు సత్యసాయి సేవాసమితి సభ్యులు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి జోనల్ కన్వీనర్ బెహరా సురేష్, కన్వీనర్ వెంకటరమణ, సభ్యులు డి.కూర్మనాథస్వామి, వి.మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

– హిరమండలం

1,550 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



మెళియాపుట్టి: స్వాధీనం చేసుకున్న డ్రమ్ములతో పోలీసులు

మెళియాపుట్టి: మెళియాపుట్టి, కొత్తూరు మండలాల్లో 1,550 లీటర్ల బెల్లం ఊటను గురువారం ధ్వంసం చేశారు. టెక్కలి, కోటబొమ్మాళి, నర్సన్నపేట, కొత్తూరు, శ్రీకాకుళం, ఆమదాలవలస ఎక్సైజ్ సిబ్బంది దాడులు చేపట్టారు. మెళియాపుట్టి మండలంలో నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. అప్పోజిపేట, సవర మద్రిపాడు గ్రామాల్లో దాడులు చేపట్టారు. అప్పోజిపేటలో 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. మద్రిపాడులో 10 లీటర్ల సారాతో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. సారా తయారీకి ఉపయోగించిన డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. టెక్కలి, కోటబొమ్మాళి ఎస్‌ఐలు వేణు, గురుమూర్తి మాట్లాడుతూ.. సారా తయారుచేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎగువ దొండమానుగూడలో..

కొత్తూరు: ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు స్థానిక సీఐ కిరణ్‌మణీశ్వరి ఆధ్వర్యంలో సారా బట్టీలపై గురువారం దాడులు నిర్వహించారు. ఎగువ దొండమానుగూడలో సారా వంటకు ఉపయోగించే 750 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాకుళం ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ బి.అప్పారావు, ఆమదాలవలస ఎక్సైజ్ ఎస్‌ఐ కావ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పని వేళల పెంపు నిర్ణయం మార్చుకోవాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణ

సరుబుజ్జిలి: ఉన్నత పాఠశాలల్లో పని వేళలు మారుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విద్యావిధానలకు విరుద్ధమని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పురుషోత్తపురం, కొత్తకోట, కాగితాపల్లి పాఠశాలలను గురువారం సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఉన్నత పాఠశాలలు దేశంలో ఎక్కడా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేయడంలేదని విద్యాశాఖాధికారులు గుర్తించాలన్నారు. శాస్త్రీయ, హేతబద్ధతలేని నిర్ణయాలకు వంతుపాడుతూ విద్యాశాఖలో ఉన్న ప్రధాన సమస్యలు పక్కదోవ పట్టించడానికే అధికారులు ఈ విధానం అవలంబిస్తున్నారని ఆరోపించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.రమణ, మండల కార్యవర్గ సభ్యులు పేడాడ అన్నాజీబాబు, అన్నెపు గోపి, పలువురు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

క్రీడలతో మానసిక ఉల్లాసం



ఉయ్యాలను ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

కొత్తూరు: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మెట్టూరు బిట్–2 ఆర్‌ఆర్ కాలనీలోని అడవికొత్తూరు ఎంపీపీ పాఠశాల విద్యార్థులు ఆడుకునేందుకు రూ.14 వేల విలువ చేసిన ఉయ్యాలను శ్రీనివాసరావు తన తండ్రి రామ్మూర్తినాయుడు జ్ఞాపకార్థం సమకూర్చారు. ఉయ్యాలను శ్రీనివాసరావు ప్రారంభించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడండి

జలుమూరు: సనాతన ధర్మాన్ని కాపాడేందుకు ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలని రొట్టవలస శ్రీరామ ఆనంద ఆశ్రమం వ్యవస్థాపక నిర్వాహకులు తొత్తడి వెంకట రమణ అన్నారు. గురువారం అల్లాడ, అల్లాడపేట, రామకృష్ణాపురం, నరసన్నపేట మండలం గొనపపేట, నడగాం, కొల్లవానిపేట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఎప్పుడు?



మాట్లాడుతున్న సూర్యనారాయణ

కొత్తూరు: వరి కోతలు పూర్తి కావస్తున్నా ఇంతవరకు పాతపట్నం నియోజవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను కూటమి ప్రభుత్వం ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని కొత్తూరు పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ చింతాడ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని మెట్టూరులో గురువారం విలేకర్లతో మాట్లాడారు. రైతులు ప్రైవేట్ వర్తకులకు తక్కువ ధరలకు ధాన్యాన్ని విక్రయించాల్సి వస్తోందన్నారు. వ్యవసాయశాఖ మంత్రి మన జిల్లా నుంచే ఉన్నా రైతులకు ఎటువంటి ప్రయోజనం లేదన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఆమదాలవలస: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు మాస్టర్ అన్నారు. తాళ్లవలసలోని కేజీబీవీ పాఠశాలలో గురువారం నిర్వహించిన బాల వికాస్ దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సత్యసాయి జన్మదిన వేడుకలు కేజీబీవీలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ శిరీష, జోనల్ కన్వీనర్ ఎం.జనార్దనరావు, తదితరులు పాల్గొన్నారు.

షెడ్ల నిర్మాణం మరోసారి అడ్డగింత



రేకులను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

నరసన్నపేట: మండల కేంద్రంలోని లక్ష్మీ టాకీస్‌కు ఎదురుగా ఉన్న ఆర్‌అండ్‌బీ స్థలంలో రేక్ షెడ్లు వేయడానికి కొందరు ప్రయత్నింగా గురువారం అధికారులు అడ్డుకున్నారు. వారం క్రితం కూడా షెడ్లు వేస్తుండగా అధికారులు తొలగించారు. ఈ స్థలంలో ఉన్న భవనాలను రెవెన్యూ అధికారులు రెండేళ్ల క్రితం ఆక్రమణల పేరిట తొలగించారు. అప్పటినుంచి ఈ స్థలం ఖాళీగానే ఉంది. మరోసారి షెడ్లు నిర్మించేందుకు రేకులు వేస్తుండగా తహసీల్దార్ సత్యనారాయణ, పంచాయతీ ఈఓ ద్రాక్షాయిని వచ్చి అడ్డుకున్నారు. అధికార పార్టీకి చెందిన నాయకుల నుంచి ఒత్తిడి రావడంతో అధికారులు పూర్తిగా తొలగింపు చర్యలు చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఈఓ ద్రాక్షాయిని వద్ద ప్రస్తావించగా.. గుట్టుచప్పుడు కాకుండా రేకులు వేస్తుండటాన్ని గమనించి కొన్నింటిని తొలగించామన్నారు. మిగిలినవి శుక్రవారం తొలగిస్తామన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

కొత్తూరు: మండలంలోని కుంటిభద్ర, మాకవరం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన వరి పొలంలో గురువారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పంట కోత ప్రయోగం చేపట్టారు. 25 చదరపు మీటర్లలో 14.550 కిలోల ధాన్యం దిగుబడి వచ్చినట్లు ఎంటీ ఎస్.సూర్యనారాయణ తెలిపారు. రసాయన ఎరువులు వినియోగించి సాగు చేసిన వరి పొలం దిగుబడికి ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటల దిగుబడికి ఎంతో తేడా ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయం సాగు చేసిన పొలంలో సుమారు 25 శాతం దిగుబడి అధికంగా వచ్చిందన్నారు.

మద్యం, గంజాయి రవాణా ప్రత్యేక నిఘా

- జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి



నరసన్నపేట: రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

నరసన్నపేట: అక్రమ మద్యం, బెల్ట్ షాపులు నియంత్రించాలని, సారా, గంజాయి వంటి అమ్మకాలపై తనిఖీలు ముమ్మరం చేయాలని జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎక్సైజ్ సీఐ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల్లో చార్జిషీట్‌లు వేయాలని సీఐ రమణమూర్తికి ఆదేశించారు. గడిచిన రెండేళ్లుగా ఎక్సైజ్ నేరాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయించాలని సూచించారు. నరసన్నపేట, పోలాకి మండలాల్లో మద్యం దుకాణాలులో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం సిబ్బందితో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు.

పాతపట్నం ఎక్సైజ్ సీఐ కార్యాలయం తనిఖీ..

పాతపట్నం: అక్రమ మద్యం, గంజాయి రవాణాపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం పాతపట్నం ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అంతర్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో నాటు సారాపై విస్తృత దాడులు చేయాలన్నారు. ఒడిశా నుంచి వచ్చిన లిక్కర్ కేసులు రిజిస్టర్ చేయాలన్నారు. స్టేషన్ పరిధిలో ఉన్న పాత ముద్దాయిలపై బైండోవర్ చేయాలన్నారు. సీఐ కె.కృష్ణారావు, ఎస్‌ఐ జోగారావు ఉన్నారు.

ప్రత్యేక అలంకరణ



ఎల్.ఎన్.పేట మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలోని వంశధార నదీ తీరంలో ఉన్న బంగారమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించినట్లు బంగారమ్మ సంస్థల సభ్యుడు వైశ్యరాజు పాండురంగనాథ రాజు గురువారం తెలిపారు. కార్తీక మాసం పురస్కరించుకుని శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

– ఎల్.ఎన్.పేట

ఆధార్ సెంటర్ల పరిశీలన



సెయింటాన్స్‌లోని ఆధార్ సెంటర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పాతపట్నం: మండల కేంద్రంలోని పలు ఆధార్ సెంటర్లను మండల ప్రత్యేకాధికారి ఎం.కరుణాకరరావు, ఎంపీడీఓ చంద్రకుమారి గురువారం పరిశీలించారు. మండలంలోని 12,707 మంది విద్యార్థుల అపార్ ఐడీలకు సంబంధించి 9,017 మందికి మాత్రమే నమోదు చేశారన్నారు. మిగిలిన 1,391 మందికి వెంటనే ఐడీలు కోసం విద్యార్థుల పుట్టిన తేదీ ధ్రువపత్రాలు లేవని ఎంపీడీఓ తెలిపారు. 107 మంది విద్యార్థులకు ఆధార్‌లో తప్పులు దొర్లాయని, 55 మంది విద్యార్థులకు లేట్ రిజిస్ట్రేషన్ చేశారన్నారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.